క్లుప్తంగా

బడిబయటి పిల్లలపై ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో బుధవారం సీఆర్పీలు బడిబయటి పిల్లలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో పిల్లలు మధ్యలో బడి మానడానికి కారణాలను విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ మధ్యలో బడిమానివేసిన, బడిబయటి పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, భార్గవి, రమాదేవి పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ చేయాలని వినతి

కొత్తకోట రూరల్: కొత్తకోట మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలంటూ భగీరథ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ రూరల్ డెవలప్‌మెంట్ సభ్యులు మంగళవారం తహసీల్దార్ బాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కావాల్సిన అర్హతలు, అన్ని సౌకర్యాలు కొత్తకోటకు ఉన్నాయని ప్రభుత్వం స్పందించి రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే ఈ ప్రాంత ప్రజలకు అన్ని విధాల మేలు చేకూరుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వినోద్‌సాగర్, శివరామ్, వినోద్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

పాన్‌గల్: మంత్రి జూపల్లి కృష్ణారావును బుధవారం కొత్తపేట కాంగ్రెస్ నాయకులు కొల్లాపూర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించి పూల బొకెను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో తిరుమల్‌యాదవ్, లోకారెడ్డి, కిరణ్‌సాగర్, యుగంధర్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు..

కొత్తకోట రూరల్: దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు రావుల సురేంద్రనాథ్‌రెడ్డి తన అనుచరులతో కలిసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. మండలంలోని కానాయపల్లి ముంపు బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వారు కోరగా అందుకు స్పందిస్తూ రానున్న రోజుల్లో తనవంతు కృషి చేస్తానని చెప్పినట్లు వారు తెలిపారు. లక్ష్మీనారాయణ, గోకరయ్య, సిద్దయ్య, రాములు, రవి తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దు చేయించి పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు బండారి లక్ష్మయ్య, చంద్రశేఖర్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కోరారు. బుధవారం దమగ్నాపురంలోని నివాసంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. సభ్యులు నాగరాజు, లక్ష్మయ్య, మనీవర్ధన్‌రెడ్డి, పి మురళీ, రామచంద్రయ్య, మల్లేష్, ఎన్‌జీ నరసింహ, ధన్వాడ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేసిన హెచ్‌ఎం వెంకట్రామరెడ్డి ఇటీవల జడ్చర్ల మండలం రంగారెడ్డిగూడ జెడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయ్యారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టయ్య, జెడ్పీటీసీ పద్మ, వేణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండలంలోని కంబాళాపురం చెందిన వడ్డే మాధవి అనారోగ్యంతో మృతి చెందగా, కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఎల్లస్వామి, స్వామి రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న భార్గవి ఈనెల 12న వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి హాకీ ఎంపికల్లో అండర్–17 హాకీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రాంమోహన్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం జమీల్ అన్నారు. భార్గవిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కంకర రోడ్డుతో కష్టాలు

- ఐదేళ్లు గడుస్తున్నా తారు వేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్డుపై కంకరవేసి వదిలి వేసిన రోడ్డు

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లి నుంచి తండా మధ్య తారు రోడ్డు ఎప్పుడు వేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బీటీ రోడ్డు కోసం ప్రభుత్వం రూ.1.30 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో రోడ్డు పనులు ప్రారంభం కావడంతో తండావాసులు, ప్రయాణికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కానీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేసి రోలింగ్ చేయగా, బీటీ పనులను చేపట్టలేదు. ఐదేళ్లుగా ఈ రోడ్డు పనులు ఇలాగే నిలిచిపోయాయి. ఈ రోడ్డు గుండా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే నరకం కనిపిస్తుందని చెబుతున్నారు. కంకర వేసి రోడ్ల పనులను వదిలేయడంతో కాలు తీసి కాలు వేయాలంటే తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా అధికారులు చొరవ తీసుకుని తండా రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై డీఈ వెంకటేశ్వర్‌సింగ్‌ను వివరణ కోరగా, తాడురుకు ఎస్‌టీఎస్‌బీఎఫ్ నుంచి రూ.2కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికల ముందు టెండర్ పిలవడంతో ఎవరూ రాలేదని, మళ్లీ టెండర్ పిలిచి పనులు పూర్తి చేస్తామన్నారు.

ముగిసిన విద్యార్థుల వివరాల పరిశీలన



విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న సభ్యులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పదో తరగతి విద్యార్థుల డేటా (నామినల్ రోల్) వివరాల పరిశీలన బుధవారంతో ముగిసినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. ఎమ్మార్సీ భవనంలో పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థుల డేటా వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పబ్లిక్ పరీక్షల నిమిత్తం సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరిశీలన టీం లక్ష్మీనారాయణ, వెంకటేష్, మోహన్, చంద్రశేఖర్, గోవింద్, జగన్, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

అర్హులైన ఓటర్లను గుర్తించండి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి

వీపనగండ్ల: గ్రామాలలో అర్హులైన ఓటర్లను గుర్తించడంలో బీఎల్‌ఓలు జాగ్రత్త వహించాలని తహసీల్దార్ వరలక్ష్మి ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల అవగాహన సదస్సును నిర్వహించారు. మృతి చెందిన ఓటర్లను, డబుల్ నమోదైన వారి వివరాలను సేకరించాలని తెలిపారు. జనవరి 1, 2024వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్లుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని అందుకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కురుమూర్తి, బీఎల్‌ఓలు సుగుణాబాయి, కృష్ణమ్మ, పారిజాత, మహేశ్వరి, వరాలు, గోవిందమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల హక్కులు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది జయలక్ష్మి

వనపర్తి టౌన్: గృహ కార్మికులు తమ హక్కులను తెలుసుకోవాలని న్యాయవాది జయలక్ష్మి అన్నారు. గృహ కార్మికులకు బుధవారం జిల్లా కేంద్రంలోని కమలానగర్ కమ్యూనిటీ హాల్‌లో మానవ హక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. గృహ కార్మికులకు వేధింపులు, ఇతర్ర సమస్యల నుంచి ఉపశమనం కలిగేందుకు చట్టం అనేక హక్కులను కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు. గృహ కార్మికులకు కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్‌ఐ, జీవిత బీమా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్మికులు అన్ని విధాలుగా హక్కులపై అవగాహనతో ఉంటేనే ఆశించిన న్యాయం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో గృహ కార్మికుల సంఘం కో–ఆర్డినేటర్ జయభారతి, సత్యమ్మ, లక్ష్మి, పార్వతమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పాఠశాల ఆవరణంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు అవుతాయో అని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం ఆరు నుంచి పదోతరగతి వరకు కొనసాగుతున్నాయి. పాఠశాల మొత్తంలో సుమారు 540 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కంచెను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అలరించిన సెమీ క్రిస్మస్ వేడుకలు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి ఎంబీ చర్చి ఆవరణలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాయక బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవులు కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. కేక్‌కట్ చేశారు. హైదరాబాద్‌లోని డెస్టినేషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ సైలస్ రెజినాల్డ్ ముఖ్య సందేశం ఇచ్చారు. బైబిల్‌లోని పలు ఘట్టాలను చదివి వినిపించారు. ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో చిన్నారులు, యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంబీసీ చర్చి వైస్ చైర్మన్ బీఎ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఎ.స్టిఫెన్, ఇమ్మాన్యుయేల్ పాస్టర్లు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య పాడుబావి



అమరచింత: పట్టణంలోని శివాజీనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న నాగులబావి పాడుబావిగా మారిన అధికారులు పూడ్చే ప్రయత్నం చేయక పోవడంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. షాదీఖాన సమీపంలో పాడుబావి ఉండటం, పంట పొలాలకు అక్కడి నుంచే కాలిబాట ఉండటంతో రైతులతో పాటు కాలనీ ప్రజలు, తండా వాసులు వెళుతుంటారు. పాడుబావిలో ఒకటవ వార్డులోని ఆయా కాలనీలకు చెందిన మురుగు చేరుతుండటంతో చుట్టుపక్కల దుర్వాసన వస్తుంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన బావిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



గోపాల్‌పేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు మంగళవారం నుంచి ప్రారంభమైన తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం కొనసాగింది. 8గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని చెప్పారు.

బిల్లులు చేయడం లేదని నిరసన

అడ్డాకుల: కందూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను మండల పరిషత్ అధికారులు చేయడం లేదని సర్పంచ్ శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అడ్డాకుల కార్యాలయంలో ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ అతహర్, ఈసీ రమేష్ వద్ద బిల్లుల పెండింగ్‌పై నిరసన తెలిపారు. 2019లో అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ సూచన మేరకు 850 ఇంకుడు గుంతలు మంజూరు కాగా వాటిలో అదే ఏడాది 650 ఇంకుడు గుంతలను పూర్తి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. వాటిలో కేవలం 240 గుంతలకే బిల్లులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఐదారు నెలల క్రితం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేస్తే ఇప్పుడు బిల్లులు చేయడం లేదని తెలిపారు. మిగిలిపోయిన ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేస్తేనే బిల్లులు చేస్తామని అధికారులనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీడీఓ మంజుల మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు చేస్తామని తెలిపారు. కాగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచే పాత బిల్లులు రావడం లేదని అధికారుల ముందు గోడు వెళ్లబోసుకోవడం చర్చనీయాంశమైంది.

హామీలు నెరవేరుస్తాం

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తాం
- డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యం
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- 'సాక్షి' హలో ఎమ్మెల్యేకు విశేష స్పందన



దేవరకద్ర: ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషిచేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పనిచేస్తుందన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడానికి బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో దమగ్నాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన 'హలో ఎమ్మెల్యే' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి వందలాది మంది ఫోన్ కాల్స్ ద్వారా ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించారు. సమస్యలపై ప్రజలు అడిగిన ప్రశ్నలు.. ఎమ్మెల్యే స్పందించిన తీరు ఇలా..

■ **ప్రశ్న:** గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూములు పంపిణీ చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి అందుబాటులోకి తీసుకురావడంతో తమ భూములు వేరేవారి పరిధిలో ఉన్నట్లు చూపిస్తుంది. దీని వల్ల మాకు అన్యాయం జరుగుతుంది.

– బాల్‌రెడ్డి, గోపన్‌పల్లి, మండలం దేవరకద్ర

■ **ఎమ్మెల్యే:** ఈ సమస్య ఇంతకు ముందు కూడా నా దృష్టికి వచ్చింది. రికార్డులను పరిశీలించడంతోపాటు అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

■ **ప్రశ్న:** : నా కూతురు పూర్తిగా దివ్యాంగురాలు. కానీ, గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పింఛన్ మంజూరు చేయలేదు.

– సత్యన్న, సుంకరామాయపల్లె, అడ్డాకుల

■ **ఎమ్మెల్యే:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో కొత్తగా పింఛన్లు ఇవ్వడానికి అవకాశం ఉంది. మీ కూతురుకు అర్హత ఉంటే తప్పకుండా పింఛన్ వచ్చే విధంగా చూస్తా.

■ **ప్రశ్న:** గ్రామంలోని సర్వే నం.291/ 37లో 3 ఎకరాల భూమిని మా తండ్రి సాకలి చిన్న లింగన్నకు ఆపరేషన్ కింద ప్రభుత్వం ఇచ్చింది. ఆ భూమిని సర్వే చేసి చూపించాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– లక్ష్మణ్, అప్పంపల్లి, చిన్నచింతకుంట

■ **ఎమ్మెల్యే:** తహసీల్దార్‌తో మాట్లాడి సమస్య త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తా. సర్వే చేసి భూమని ఇప్పించడానికి చర్యలు తీసుకుంటా.

■ **ప్రశ్న:** కోయిల్‌సాగర్ కాల్వలో జమ్ముగడ్డి పెరిగి చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. దీంతో పంటలు ఎండిపోయి నష్టపోతున్నాం.

– జోషి ప్రహ్లాద్, తిర్మలాపూర్, చిన్నచింతకుంట

■ **ఎమ్మెల్యే:** ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి కాల్వలకు మరమ్మతు చేయడంతోపాటు చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

■ **ప్రశ్న:** ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆలయాల్లో ఏర్పాటు చేసే కమిటీ సభ్యుల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తున్నారు. అలాగే మన వద్ద కూడా దేవస్థాన కమిటీల్లో తమకు ఇచ్చేలా చూడండి.

– ఆశన్న, మొల్గర, భూత్పూర్

■ **ఎమ్మెల్యే:** తప్పకుండా ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడంతోపాటు ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తాను.

■ **ప్రశ్న:** మాకు ఆడపిల్లలు ఉన్నారు. ఉండడానికి ఇల్లు లేక అద్దె గదిలో ఉంటున్నాం. ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నా. సహాయం చేసి ఆదుకోండి.

– మహమూద, అల్లీపూర్, చిన్నచింతకుంట

■ **ఎమ్మెల్యే:** రెండ్రోజుల్లో గ్రామానికి వస్తాను. ఆ రోజు కలిస్తే తగిన సహాయం చేస్తా. ప్రభుత్వం ఇచ్చే కొత్త ఇళ్లలో ప్రాధాన్యత ఇచ్చేలా చూస్తాను.

■ **ప్రశ్న:** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రమైనా ఇక్కడ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. డిగ్రీ కళాశాల మంజూరైనా రాజకీయ కారణాలతో ఇతర ప్రాంతానికి తరలించారు. వెంటనే కళాశాల ఏర్పాటు చేయాలి.

– ఇమ్రాన్, దేవరకద్ర

■ **ఎమ్మెల్యే:** ఈ విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. మంజూరైన డిగ్రీ కళాశాలను ఎలా తరలిస్తారు. సంబంధిత అధికారులతో మాట్లాడి దేవరకద్రకు తిరిగి తెచ్చేలా చూస్తా.

సాక్షి ఫోన్ ఇన్

■ **ప్రశ్న:** మా గ్రామం వద్ద వంతెన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. చివరి దశలో ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే వంతెన పనులు పూర్తి చేయించాలి.

– వినోద్‌కుమార్, వర్నె, అడ్డాకుల

■ **ఎమ్మెల్యే:** దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడాను. బ్రిడ్జికి సంబంధించి స్థల సమస్యపై అధికారులతో చర్చించి.. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

■ **ప్రశ్న:** దేవరకద్రలోని ఓవర్ బ్రిడ్జి ఎక్కి దిగే ప్రాంతంలో రోడ్డు వెడల్పు లేక వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. సంతరోజు సమస్య చాలా తీవ్రంగా ఉంటుంది.

– ఉమాశంకర్, దేవరకద్ర

■ **ఎమ్మెల్యే:** ప్రణాళిక లేకుండా ఆర్వోబీని నిర్మించారు. దీనిపై అధికారులతో మాట్లాడి ఎక్కి దిగే ప్రాంతంలో రోడ్డు వెడల్పు చేయిస్తాను.

■ **ప్రశ్న:** మూసాపేటలో రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు చేయాలి. అలాగే మండల కార్యాలయం కూడా మూసాపేటలో ఉండాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి.

– మహేందర్, మూసాపేట

■ **ఎమ్మెల్యే:** ఈ సమస్య నా దృష్టిలో ఉంది. కార్యాలయాల ఏర్పాటుపై ఉన్నతాధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటాను.

■ **ప్రశ్న:** మైనార్టీ లోన్ మంజూరు కాగా.. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయింది. తిరిగి లోన్ వచ్చేలా చూడండి.

– ముజీబీర్ రహమాన్, దేవరకద్ర

■ **ఎమ్మెల్యే:** ఈ విషయమై అధికారులతో చర్చించి అవకాశం ఉంటే వచ్చేలా చూస్తాను.

■ **ప్రశ్న:** కొత్త రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో అనేక పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నాం. దయచేసి కొత్త రేషన్ కార్డులు ఇప్పించండి.

– నాగరాజు, చర్లపల్లి, కొత్తకోట

■ **ఎమ్మెల్యే:** గత ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయకుండా చాలామందిని ఇబ్బందుల పాలు చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీచేస్తాం.

■ **ప్రశ్న:** గత ప్రభుత్వం తెచ్చిన జీఓ 46తో గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు అన్యాయం జరిగింది. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం చేయాలి.

– నాగేశ్, భూత్పూర్

■ **ఎమ్మెల్యే:** ఈ జీఓ వల్ల ఎదురయ్యే ఇబ్బందులు నాకు తెలుసు. అసెంబ్లీలో ప్రస్తావించడంతోపాటు సీఎం దృష్టికి తీసుకెళ్తాను.

చెరుకు రైతులను ఆదుకోవాలి

ఆత్మకూర్: అమరచింత మండలం పామిరెడ్డిపల్లెలో రైతులు శ్రీకాంత్, చిన్నారెడ్డి 10 ఎకరాల్లో సాగుచేస్తున్న చెరుకుపంట ప్రమాదవశాత్తు కాలిపోయిందని రైతులను ప్రభుత్వం, చెరుకు ఫ్యాక్టరీ నిర్వాహకులు ఆదుకోవాలని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. రైతులు రూ.2లక్షలు వరకు నష్టపోయారని చెరుకుతో పాటు, డ్రిప్ పైపులు కాలిపోయాయని తెలిపారు. కాలిన చెరుకుకు టన్నుకు రూ.200 దాక కోత విధించకుండా పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించాలని, కొత్త డ్రిప్ పైపులు ఇవ్వాలని కోరారు.

కర్నెతండా లిఫ్ట్ ద్వారా సాగునీరు



కర్నెతండాలో లిఫ్టు ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం: మండలంలోని కర్నెతండా సమీపంలో నిర్మిస్తున్న లిఫ్టు పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసి వచ్చే వానాకాలం పంటలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటి సారిగా బుధవారం మండల కేంద్రానికి ఆయన వచ్చారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బస్టాండ్ వద్దకు చేరుకుని గజమాలతో సన్మానించారు. అనంతరం ఆయన కర్నెతండా సమీపంలో నిర్మిస్తున్న కర్నెతండా లిఫ్టు పనులను పరిశీలించారు. అధికారులతో పనుల వివరాలను తెలుసుకున్నారు. అధికారులు లిఫ్టు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ లిఫ్టు ద్వారా 63 మీటర్ల ఎత్తుకు సాగునీటిని ఎత్తిపోసి వ్యవసాయానికి నారు అందించనున్నట్లు చెప్పారు. పనులు పూర్తయితే ఎత్తు ప్రాంతంలో ఉన్న 4,200 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి లిఫ్టును ప్రారంభిస్తామన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు అధికారులు చొరవ తీసుకోవాలి

ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల త్వరితగతిన పూర్తి కావడానికి అన్ని శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కృష్ణానాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశానికి ప్రతి శాఖ నుంచి డీఈ, ఏఈలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సమావేశానికి హాజరుకాని డీఈలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు మధుసూదన్ రావు, నరేందర్‌రెడ్డి, కమలహాసన్, భరత్, లాల్‌సింగ్, వెంకటన్న తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ..

వనపర్తిటౌన్: పట్టణంలోని 21, 11, 14, 22, 25, 31వ వార్డుల్లో బుధవారం సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి భూమి పూజ చేశారు. 21వ వార్డులో కౌన్సిలర్ వెంకటేష్, వార్డు ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు గాంధీనగర్‌లోని కర్రెమ్మగుడిలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఇంజినీర్ భాస్కర్, వెంకటయ్య, కౌన్సిలర్లు బ్రహ్మం, సుమిత్ర యాదగిరి, లక్ష్మి, రవియాదవ్, జయసుధ మధుగౌడ్, సత్యం, విభూది నారాయణ తదితరులు పాల్గొన్నారు.